

కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ఖమ్మం జిల్లా మధిరలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు

# సగర్వంగా..సంబురంగా..

- జాతీయ, గులాబీ పతాకాల రెపరెపలు
- అమరవీరులకు నివాళులు
- ఉద్యమకారులకు సన్మానాలు
- దవాఖానలో పండ్లు, బ్రెడ్‌ల పంపిణీ
- మహారాష్ట్రలో స్త్రీలకు కుట్టుమిషన్లు
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలు



ఉద్యమకారుడు నర్సింహులును సత్కరిస్తున్న జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు



వంగపల్లి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 3: తెలంగాణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం జాతీయ పతాకం రెపరెపలాడింది. గులాబీ పతాకం సగర్వంగా ఎగిరింది. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో పార్టీ శ్రేణులు ఉద్యమంలో అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఉద్యమకారులను శాలువాలతో సన్మానించారు. దవాఖానల్లో పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేయగా, మహారాష్ట్రలో మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జాతీయ జెండా, బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. వనపర్తి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, బీఆర్‌ఎస్ జెండాలను నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. జోగుళాంబ గద్వాల లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని జాతీయ, బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించారు. గద్వాల జిల్లా దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాంకిషన్‌రావు జాతీయ, గులాబీ జెండాను ఎగురవేశారు. కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ తదితరులు ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.

కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ జాతీయ పతాకంతోపాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ జెండా ఆవిష్కరించారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అధ్యక్షతన 1969 ఉద్యమకారులను సన్మానించారు. జనగామ జిల్లా యశ్వంతపూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ జెండాను, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ స్థలంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్, భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటాణి సిద్దు, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ జెండాలను ఆవిష్కరించారు. మహబూబాబాద్‌జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి ఎంపీ మాలోత్ కవిత జాతీయ జెండాను ఎగుర వేశారు. ములుగు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తాతా మధుసూదన్ జాతీయజెండాను, బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఉద్యమకారుడు రామారావు ఎగురవేశారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ చోప్రా అసెంబ్లీ సమన్వయ కర్త, జల్గావ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కోమల్ పాటిల్, తాలూకా మహిళా విభాగ సమన్వయ కర్త లోటీనా జాదవ్ చొరవతో, వధోడాలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

## చిహ్నాల తొలగింపు ప్రజలను అవమానించడమే..

### మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా





కంఠేశ్వర్/కామారెడ్డి, జూన్ 3: ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తులను తెలంగాణ రాజముద్ర నుంచి తొలగించడమంటే రాష్ట్ర ప్రజల్ని అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా విమర్శించారు. నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జాతీయ జెండాతోపాటు గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాజిరెడ్డి, బిగాల మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలను చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్ర ఆనవాళ్లు లేకుండా చేసేందుకు రాజముద్రను తయారు చేస్తున్నారని ఆరోపించారు. సీఎంకు రాజకీయంపై ఉన్న ప్రేమ.. పాలన మీద లేదని విమర్శించారు.



## ఓరుగల్లు నుంచి మరో ఉద్యమం: దాస్యం

హనుమకొండ, జూన్ 3: ప్రభుత్వ లోగో మార్పు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తన వైఖరి మార్చుకోకపోతే ఓరుగల్లు నుంచి మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. ఇందుకు ఉద్యమకారులు, మేధావులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, దాస్యం వినయ్ భాస్కర్ ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారులను చంపినోళ్లే ఇపుడు ఉద్యమకారులను సన్మానించడం చూస్తుంటే హంతకులే సంతాప సభ జరిపినట్టు ఉన్నదని దాస్యం మండిపడ్డారు.

## ఉద్యమకారులపై తుపాకీ ఎత్తిన చరిత్ర మీది: గంప

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు వ్యతిరేకంగా మాట్లాడటడం మానుకోవాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హితవుపలికారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎత్తిన చరిత్ర రేవంత్‌దేనని విమర్శించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.



## నీతి, నిజాయితీకి కేరాఫ్ బీఆర్‌ఎస్

### ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్





గద్వాల, జూన్ 3: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు లొంగలేదని, నీతి, నిజాయితీకి కేరాఫ్‌గా వారు ఉన్నారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ, బీఆర్‌ఎస్ జెండాలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఎగురవేశారు. నడిగడ్డ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారని ఎమ్మెల్యే బండ్ల చెప్పారు. తన విజయానికి కృషి చేసిన అందరికీ ఎమ్మెల్సీ నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి: ఎర్రబెల్లి దయాకర్‌రావు



జనగామ, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, ఆయన టీడీపీలో ఉన్నప్పుడు ఏనాడూ ఉద్యమంలో పాల్గొనలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకను సోమవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. యశ్వంతపూర్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ జెండాను, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, కడియం శ్రీహరి తెలంగాణకు మద్దతు ఇవ్వకపోగా, బాబు లేఖ ఇవ్వకుండా అడ్డుపడిన ద్రోహులు అని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులకు తెలంగాణ గురించి, అమరవీరుల త్యాగాల గురించి మాట్లాడే హక్కులేదని స్పష్టంచేశారు.

## కేసులకు భయపడేది లేదు: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎన్నికల సమయంలో తాను ఏదైనా తప్పు చేస్తే ఎన్నికల సంఘం కేసు నమోదు చేయాలి కానీ ఒక కాంగ్రెస్ నాయకుడు ఒత్తిడి చేస్తే జనగామ పోలీసు అధికారులు తనపై కేసు నమోదు చేయడం చాలా దారుణం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తిని కాదని తెలిపారు. గ్రామాల్లో చిన్నచిన్న భూవివాదాల్లో తలదూర్చి డబ్బులు గుంజుతున్నారని పోలీసుల తీరును ఎమ్మెల్యే తప్పుబట్టారు. శృతిమించితే వీటన్నింటి చూస్తూ ఊరుకోమని, అవసరమైతే ప్రజల కోసం పెద్దఎత్తున ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు.

# రేవంత్‌తో ‘తెలంగాణ’ గాయబ్

మొదటిపేజీ తరువాయి...

అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ సోయిని ఖతం చేస్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎన్నటికీ తెలంగాణ ఉద్యమకారుడు కాలేదని, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన తెలంగాణద్రోహిగా చరిత్రలో మిగిలిపోతాడని విమర్శించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం సిద్దిపేట బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వంటేరు యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్ కుమార్, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీ ప్రసాద్, కవి నందిని సిధారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులతో కలిసి జాతీయ జెండా, బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని హరీశ్‌రావు ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. ముందుగా ఉద్యమకారులందరికీ శిరస్సువంచి నమస్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తుచేశారు. నాడు జైల్లో ఉన్నా బాధపడలేదని, ఆ రోజుల్లో ఎదురైన కష్టాలకు భయపడలేదని చెప్పారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా చేయాలని ఆంధ్రానాయకులు కుట్రలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. కూడవెల్లి, హల్దీవాగు పరివాహక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతే, కేసీఆర్ బస్సు యాత్రకు బయలు దేరగానే నీళ్లు వచ్చాయని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది? ప్రస్తుత కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ఆలోచన చేయాలని సూచించారు.

***సిద్దిపేట లేకుంటే కేసీఆర్ లేడు..**

కొన్ని దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ వచ్చిందని, ఆ కలను నిజం చేసింది కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ అని హరీశ్‌రావు చెప్పారు. ‘సిద్దిపేట లేకుంటే కేసీఆర్ లేడు, కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు’ అని స్పష్టంచేశారు. 1969 ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి విజయాన్నందించింది సిద్దిపేట గడ్డ అని చెప్పారు. ఉద్యమ సమయంలో నందిని సిధారెడ్డి, రమణాచారి, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, దేవీ ప్రసాద్, దివంగత నేత రామలింగారెడ్డి లాంటి నేతల సేవలు మరువలేనివని కొనియాడారు. ఉద్యమంలో నిస్వార్థ సేవలందించిన వారిని గుర్తుంచుకోవడమే నిజమైన పండుగ అని చెప్పారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ‘రేవంత్‌రెడ్డి అనే వ్యక్తి సీఎం కావొచ్చు.. రేపు అంతకంటే పెద్దపీఠం ఎక్కవచ్చు కానీ, తెలంగాణ ఉద్యమకారుడు అనే కీర్తి రేవంత్‌రెడ్డి పిడికెడు మన్ను బుక్కినా రాదు. సిద్దిపేట నుంచి పోరాడిన ఒక తెలంగాణ ఉద్యమకారుడి పాద ధూళికున్న విలువ కూడా రేవంత్‌రెడ్డికి లేదు’ అని విమర్శించారు.



సిద్దిపేటలో నందిని సిధారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, వొడితెల తదితరులు

**రేవంత్‌రెడ్డి ఎప్పటికీ ఉద్యమకారుడు కాలేడు: దేశపతి శ్రీనివాస్**

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే కావచ్చు కానీ.. ఎప్పటికీ తెలంగాణ ఉద్యమకారుడు కాలేడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలో ఉండి పోరాడిన ఒక తెలంగాణ పోరాట కార్యకర్త పాద ధూళికున్న విలువ కూడా రేవంత్‌రెడ్డికి లేదని మండిపడ్డారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ఎంతో ప్రాణాలను తీసింది కాంగ్రెస్ పార్టీయే అని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ పార్టీని ఎదుర్కొనేందుకు, దేశంలో లౌకిక విలువలను, సామరస్యాన్ని కాపాడాలని మాత్రమే బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేశారని చెప్పారు.

**ఉద్యమకారుల సన్మానం ఎంతో గౌరవం: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

సిద్దిపేట అర్బన్, జూన్ 3: తెలంగాణ ఉద్యమంలో 14 సంవత్సరాలు ఎంతో కష్టపడి పని చేసిన ఉద్యమకారులను దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సన్మానించుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్టు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సుదీర్ఘ కాలంపాటు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపిన ఉద్యమకారులను గుర్తుంచుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు.

**ఉద్యమంలో పాల్గొనడం అదృష్టం: రసమయి బాలకిషన్**

తెలంగాణ 14 ఏండ్ల ఉద్యమంలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చెప్పారు. చాలా మంది చాలా రకాలుగా మాట్లాడినా ఎవరికీ సాధ్యం కానిది కేవలం కేసీఆర్ వల్లనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని చెప్పారు.

**నాడు జై తెలంగాణ అంటేనే భయపడే పరిస్థితి: నందిని సిధారెడ్డి**

1969 ఉద్యమంలో కూడా ఉద్యమాలు చేశామని, తెలంగాణ అంటేనే జైల్లో పెట్టే పరిస్థితులు నాడు ఉండేవని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి గుర్తుచేశారు. సిద్దిపేటలోనే 1996లోనే మంజీరా రచయితల సంఘం ఏర్పాటు చేసి తెలంగాణ ఆవశ్యకతను వివరించామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేట గడ్డ రక్షణ కవచంగా నిలిచిందని చెప్పారు.14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం సాధించామని తెలిపారు.

**ఉత్సవాలు ఎంతో సంతోషం:సతీశ్‌కుమార్**

నాడు ఉద్యమంలో ఎంతో నిబద్ధతతో పోరాడి తెలంగాణ సాధించామో.. అంతే నిబద్ధతతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సాధించి దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు.

## ఉద్యమానికి పోరుగడ్డ సిద్దిపేట: దేవీప్రసాద్



తెలంగాణ మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన గడ్డ సిద్దిపేట అని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ చెప్పారు. ఇలాంటి గడ్డమీద ఉద్యమకారులను ఉద్యకారుడైన హరీశ్‌రావు చేతులమీదుగా సన్మానం జరగడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని చెప్పారు.



## విషసంస్కృతికి రేవంత్ ఆజ్యం: నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో విష సంస్కృతికి ఆజ్యం పోస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం వనపర్తి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, బీఆర్‌ఎస్ జెండాలను నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంగా నిలుస్తుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. పదేండ్ల తర్వాత 64 సీట్లు గెలిచి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. అరాచకాలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్‌కు 88 సీట్లు వచ్చినా హత్యలు, భౌతికదాడులు, అరాచకాలు లేవని, వ్యక్తిగత శత్రుత్వాలకు తావులేకుండా కేసీఆర్ పాలన కొనసాగిందని గుర్తుచేశారు.



## శ్రీధర్‌రెడ్డి హత్యపై నిష్పక్షపాత విచారణ జరపాలి: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో జరిగిన శ్రీధర్‌రెడ్డి హత్యపై నిష్పక్షపాతంగా పోలీసులు విచారణ జరపాలని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ హత్యలో మంత్రి జూపల్లి సమాచారాన్ని దాస్తున్నారన్న విషయం పోలీసులకు కూడా తెలుసని పేర్కొన్నారు. హోంమంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ హత్యపై ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమని తెలిపారు. ముఖ్యమంత్రి రెచ్చగొట్టే మాటలతోనే కాంగ్రెస్ శ్రేణులు మరింత పెట్రేగిపోతున్నాయని మండిపడ్డారు.

## కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో రాష్ట్రం ఆగం

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, జూన్ 3: ‘రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకే తెలియడం లేదు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వ్యవసాయం గురించి మాట్లాడుతున్నాడు. ఇంకో మంత్రి మరో శాఖ గురించి వివరాలు చెప్తున్నడు. వారి శాఖలు ఏంటో కూడా వారికి తెలువకుండా పోయింది’ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎద్దేవా చేశారు. సోమవారం కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మంత్రుల వ్యవస్థ అదుపు తప్పిందని, వాళ్లను నియంత్రిస్తే ఎక్కడ తనపై అసమ్మతి తెస్తారో? అని సీఎం రేవంత్‌రెడ్డి భయపడిపోతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో రాష్ట్రం ఆగమైపోయిందని, మళ్లీ 1956 నాటి పరిస్థితులను తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు, రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోయిందని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉందని, వారి పిల్లల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం కానివ్వమని స్పష్టం చేశారు.





## అభివృద్ధిని మరిచిన సర్కారు: బడుగుల

సూర్యాపేట టౌన్, జూన్ 3: ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా మరిచిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ విమర్శించారు. సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకంతోపాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహా ఉద్యమాన్ని నిర్మించిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించి పదేండ్లు అధికారం చేపట్టి అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని చెప్పారు. నేడు అన్ని వర్గాల ప్రజలు ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో అనేక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన బీఆర్‌ఎస్ పడిపోతుందని కాంగ్రెస్ నాయకులు పిచ్చికలలు కంటున్నారని, కాంగ్రెస్ జేజేమ్మలు వచ్చినా తెలంగాణలో కేసీఆర్‌కు తిరుగు లేదని స్పష్టంచేశారు.



ఖమ్మంలో మాట్లాడతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తాతా మధుసూదన్

## తెలంగాణ ప్రజలతో కేసీఆర్‌ది పేగుబంధం

### బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):తెలంగాణ ప్రజలతో కేసీఆర్‌ది పేగుబంధమని, కొట్లాడి తెలంగాణను సాధించుకున్నాం తప్ప ఢిల్లీ పెత్తందారుల మెహర్బానీతో కాదని బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తాతా మధుసూదన్ స్పష్టంచేశారు. ఖమ్మం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో జాతీయజెండాను ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ జెండాను ఉద్యమకారుడు తవిడిశెట్టి రామారావు ఎగురవేశారు. అంబేద్కర్, జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ చరిత్రను చెరిపేందుకు కాంగ్రెస్ భారీ కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర రాజముద్ర మార్చినా, తెలంగాణ గీతాన్ని మార్చినా ప్రజల గుండెల్లో కేసీఆర్ ముద్రను తొలగించలేరని స్పష్టంచేశారు.

## పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం: సండ్ర వెంకటవీరయ్య



రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీని గెలిపించడం ఆ పార్టీ కోల్పోతున్న ప్రజాదరణకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం వందలాది తెలంగాణ బిడ్డలు ప్రాణాలు కోల్పోయిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతామని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## తక్కువ కాలంలో ఎక్కువ ప్రజావ్యతిరేకత

### మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 3:కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనను విస్మరించిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన జాతీయ జెండా, బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. రెడ్‌క్రాస్ అనాథ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు.